కర్మబద్ధులు

బి. లక్ష్మీనారాయణరావు

౧

వెన్నెలరాత్రులు. వేసవియనుట రాత్రులు మరింత ఆందదాయకంగా వున్నాయి. శుక్లపక్ష చంద్రుడు ప్రకృతికంతటికిని క్రొత్తచైతన్యం గలిగిస్తున్నాడు.

బసవనడిలో డాక్టరు శ్రీపతిరావుగారి మేడ వెన్నెట్లో లలిత వీణవాయిస్తూంది. తీగవంటి దేహం. ఆకోమలమైనదేహంలో ప్రవహించే వినిర్మలరక్తకాంతిని పైకి ప్రసరింపజేసే చాయ. ఎత్తుకుదగిన అవయవ సౌష్ఠవం. చూపరులదృష్టులను కట్టివేయజాలిన సౌందర్యం. ఇప్పుడిప్పుడే యౌవనం పొడచూపుతూంది కాని, బాల్యచాపల్యం, ముగ్ధత్వం, యింకనూ పూర్తిగా వదలలేదు. ఒక్కటేబిడ్డ అవడంవల్లనూ, స్వేచ్ఛగా పెరగడంవల్లనూ ముఖంలో కొంత పెంకెతనంకూడా గోచరిస్తూంది.

లలిత తన సన్నని గాత్రాన్ని వీణానాదంతో మిళితంజేసి, మోహనరాగంలో "ననుబాలింప, నడచి వచ్చితివో నాప్రాణనాథా" అనేకృతి పాడుతూంది. అంతలో ప్రకాశంవచ్చి యెదుటనిలబడినాడు. కాని, గానసమాధిలోవుండే లలితకు ఖాతికజ్ఞానమే లేదు.

"వనజనయన, నీమోమును జూచుట జీవనమని,
నెనరున, నామనసు మర్మము దెలసి" నను.

తన్నుమరచి పాడుతున్నది లలిత. ప్రకాశం చిరునవ్వు నవ్వుతూ అట్లే నిలబడినాడు. వయ సిరువదియేండ్లు. ఎత్తైన పలుచనిదేహం. సాధారణంగా అగుపడని అందం. ముఖమెప్పుడూ నవ్వులు కురిపిస్తూంటుంది. లలిత చల్లగా పాడుతూనే వుంది.

"సురపతీ నీలామణినిభతనువుతో"

అప్పుడు,

ప్రకాశం:—ఆను లలితా, రసభంగ మవుతుందనే నంతసల్లగా లేను.

లలిత వులిక్కిపడింది. ఎదుట నవ్వుతూ నిలుచున్నాడు ప్రకాశం.

లలిత:—ఎంతసేపైంది ప్రకాశం వచ్చి? నే గమనించనేలేదు.

ప్రకాశం:—కొంతసేపయిందికాని, నేను నల్లగున్నానా లలితా?

లలిత:—నీవు నల్లగున్నావని యెవరన్నారు?

ప్రకాశం: — ఇదివరకూ పాడుతున్నావుగా "సురపతి నీలామణి నిభతనువుతో" అని.

లలిత:—నీకు పెంకెతనం జాస్తి అవుతూంది ప్రకాశం. ఈనాలుగేళ్లూ మెడికల్ స్కూల్లో యిదే నేర్చినట్టుంది. నేను నీతో మాటలుమానుతా.

ప్రకాశం: — అంతకోప మెందుకులే. నేనే మద్రాసువెళ్లిపోతా. అక్కడ ఆస్పత్రిలో పనినేర్చుకున్నట్టయినా అవుతుంది.

లలిత:—వద్దు ప్రకాశం, వెళ్లొద్దు. నాకు నీపైన కోపంలేదు.

ప్రకాశం:—మరి నన్ను పెంకెవాడన్నావుగా?

లలిత:—నీవు యీరోజు మద్రాసునుండి వచ్చి మరి అంతలోనే వెళ్లిపోతానంటే?

ప్రకాశం: — అదిగో, మాట తిరగేస్తున్నావు. మొదటనే నేనువెళ్తానన్నానా? నీవు స్కూల్లో యిదే నేర్చినట్టుంది.

లలిత:—ఏమోలే. నీతో వాదించలేను. రాత్రిభోజనమయినాక హిందూస్తానీపాటలు పాడతానన్నావు కదూ. మరి యిప్పుడు పాడవూ ప్రకాశం?

ప్రకాశం:— నేనోరిన కృతి వకటి నీవు పాడితే, తర్వాత నీవు కోరినన్ని హిందూస్తానీపాటలు నేను పాడుతా.

లలిత:—కానీ. ఏదిపాడమంటావో చెప్పు.

ప్రకాశం:—నాయెదురుగా అలా కూర్చుని, నిదానంగా, "చిన్ననాడె నా చెయిపట్టితివి" అనే కృతి పాడు.

లలిత పాడుతూంది. శ్రీపతిరావున్నూ, ఆయన భార్య కమలమ్మ వచ్చి కూర్చున్నారు. తాంబూలం వేసుకుంటూ పాటవింటున్నాడు శ్రీపతిరావు.

శ్రీపతి:— అంతేనా! ప్రకాశాన్ని చూచి పాడుతూంటే, అతన్ని గురించేనేమో అనుకున్నా.

లలిత సిగ్గుతో తలవంచుకొని జవాబుచెప్పక కూర్చుంది.

కమలమ్మ:— ఏమిహాస్యమండీ! పిచ్చియభిప్రాయాలన్నీ పిల్లతలలో వేస్తున్నారు. ఇప్పటికే వీళ్లిద్దరికీ సంగీతంపిచ్చి తలకెక్కి యింటిని నాటకంథియేటరుగా మార్చేసినారు. ఇంక మీమాటలు వింటూంటే.....

"లలిత పాడుతూంది.....పాటవింటున్నాడు శ్రీపతిరావు."

లలిత పాటనుముగించి, "నాన్నా, ప్రకాశాన్ని హిందూస్తానీ పాడమను" అంటూ తండ్రివద్దవచ్చి కూర్చుంది.

శ్రీపతి:—పాడ్తాడు కాని, నీవింతసేపూ యెవరిని గూర్చి పాడుతున్నావమ్మా?

లలిత:— ఎవరినిగూర్చీకాదు నాన్నా, త్యాగయ్యకృతి.

శ్రీపతి:—ఇంక నీలెక్చరు చాలించు. నీయేడు పెప్పుడూ యింతే. నీకు ఆటా పాటా? నీకు జీవితంలో ఆనందమనేదే కనుపించదు. లలితకూడా మానవపశువువలె జీవితం గడపాలంటావు. మాసంగీతమూ, మామాటలూ నీచెవికి కఠోరంగావుంటే చెవులుమూసుకోరాదూ.

కమలమ్మ:—నేనంటే మీ కెప్పుడూ యింతే లెండి. నామాటలెప్పుడూ మీకు చెడ్డగా గనపడుతుంటాయి. మీరొక్కరే పిల్లదానిసౌఖ్యం కోరేవారు!

శ్రీపతి:—సరేలే. నీమాటలుచాలించి పాట వింటూకూర్చో. ప్రకాశం, మీరిద్దరూ 'హరిగుణగావత, నాచుంగీ' అనేపాట పాడండి. విని చాలరోజులయింది.

ప్రకాశం:—లలితా, హార్మోనియం తీసుకురాపో.

లలిత హార్మోనియం తెచ్చి యిచ్చింది. ప్రకాశం కొంతసేపు యమునాకల్యాణిరాగం ఆలాపనజేసి, పాట అందుకున్నాడు. లలిత తనస్వరం ప్రకాశంస్వరంతో జేర్చి అనుసరిస్తూంది.

"హరిగుణగావతనాచుంగీ, మైతో. హరి"
కొయి జావెమథురా, కొయివారణాసీ,
ఘర్ మై దరశన్ పావుంగీ, మైతో॥ ౧॥
మీరాకేప్రభూ, గిరిధరనాగర్, నితార
ప్రేమరసచాకుంగీ, మైతో॥ హరి॥"

ఇరువురిస్వరాలూ హార్మోనియంనాదంతో చేరిపోయి యేకతోముఖంగా ప్రవహిస్తున్నాయి. ప్రకాశం యొక్క గంభీరమైన ఝూలరీస్వరానికి లలితస్వరం మార్దవాన్నీ, లాలిత్యాన్నీ కలిగిస్తూంది. వసంతకాలపు చంద్రుడు కలిగించిన యావరణంలో లీనమై, యీప్రపంచాన్నే మరచిపాడుతున్నారు కోకిలజంటవలె. శ్రీపతిరావుకు పరమానందమయింది. కండ్లకొలుకులలో ఆనందబాష్పాలు నిలిచినాయి. ఈ యిరువురి స్వరములూ ఐక్యమైనట్టు నీరిజీవితములు రెండూ ఐక్యమై నడవడం తానుజూచి ఆనందించడ మెప్పుడా యనుకున్నాడు.

పాట ఆగింది. ప్రకాశం హార్మోనియంనిలిపినాడు.

లలిత:—నాన్నా, ప్రకాశాన్ని 'రామ కహానాజీ, ఏకన్ మర్తీకా మైనా' అనేపాట పాడుమను నాన్నా. ప్రకాశం పాడినట్టాపాట ఎవ్వరూపాడలేరు.

శ్రీపతి:—ఈనాటికిచాలులే లలితా. నేడే వూరినుంచీవచ్చి చాలాఅలసిపోయియుంటాడు. పోయి పడుకోనీ. ప్రకాశం, పడుకోపో. ఇంకేం, పరీక్షలయినాయి. కొన్నాళ్లు పుస్తకాలు కట్టిపెట్టి హాయిగా కాలంగడుపు.

లలిత:—నాకు హిందూస్తానీపాటలు నేర్పమను నాన్నా. నే నడిగేకొద్దీ గర్వం జాస్తి అతనికి.

ప్రకాశం:—ఇంతగడుసుదాని కెవరు నేర్పుతారు పో. ఇప్పు డన్నదానికై క్షమాపణవేడుకుంటే గాని నీతో మాటలుకూడా ఆడను.

అని నవ్వుకుంటూ వెళ్లిపోయినాడు.

లలిత:—చూడునాన్నా, ఎంత గర్వమో. క్షమాపణ అడగాలట. నేనేమన్నాను?

శ్రీపతి:—పెద్దవాణ్ణి గర్వమనడంతప్పుకాదూ. రేపు క్షమించమని అడిగితే పోయిందిలే. ఇక పోదాంపద. పదిగంటలయింది.

౨

సాయంకాల మేడుగంటలయింది. శ్రీపతిరావుగారప్పుడే క్లబ్బునుండివచ్చి హాలులో పేపరు జూచుకుంటూ కూర్చున్నారు. ఇంతలో కమలమ్మ వచ్చి భర్తప్రక్కన కుర్చీలో కూర్చుంది. శ్రీపతిరావుగారు పేపరు పక్కకు పెట్టి,

"ఏ మాశ్చర్యం! నేడు తీరికగాకూర్చున్నావు?"

కమలమ్మ:—వంటయింది. లలితా, ప్రకాశం సినీమానుంచీ యింకా రాలేదు. మీరేమో యివాళ త్వరగావచ్చినారు, మేలే. ఇంకా వాళ్లెంతసేపటికి వస్తారో?

శ్రీపతి:—ఇప్పు డేమంతపొద్దయింది? ఏడు గంటలేకదూ! అర్ధగంటలో వస్తారు.

కమలమ్మ:—నేనేమైనా అంటే మీకు కోపం వస్తుందికాని, లలిత ప్రకాశంతో యీ విధంగా తిరగడం బాగులేదండి. పిల్లలుగావున్నన్నాళ్లూ సరిపోయిందికాని యికమీదట యింతస్వేచ్ఛగా వదిత్తే లోకులేమంటారు?

శ్రీపతి:—నీమొగం, యేమంటారు? వీళ్లింకా పిల్లలుకాక పెద్దవాళ్లయినారేం? ఒక్కరనడానికయినా యేముంది? ఎప్పటికయినా భార్యాభర్తలయేవారేకదూ.

ప్రకాశానికి డాక్టరుపరీక్ష ముగిసింది. అమ్మాయి కూడా స్కూలుఫైనలయింది. చదువు భంగమవుతుందనే చింతకూడా లేదు. త్వరలో వివాహంచేయాలని యీరోజు క్లబ్బులో స్నేహితులుకూడా మాటప్రస్తాపంగా అన్నారు.

కమలమ్మ:—అమ్మా! ఇంతవరకూ పోయిందీ విషయం! అయితే పిల్లనొంతు కోయాలనుకున్నారు! ఏదో దిక్కులేనిపిల్లవాణ్ణితెచ్చి సాకుతున్నారని అనుకున్నానేకాని అల్లుణ్ణిచేసుకుంటా రనుకోలేదు. సాకిన మమతవుంటే ఆస్తియివ్వండి. ఎక్కడైనా పిల్లనుదెచ్చి వివాహంచేయండి. కాని, నాఒక్క బిడ్డనూ యీ దిక్కులేనివాని కివ్వకండి.

శ్రీపతి:—ఏమికమలా, విపరీతంగా మాట్లాడుతున్నావు. లలితపుట్టకమునుపునుండీ సాకుతున్నావు కదూ ప్రకాశాన్ని? వానిలో ఏంలోపం కనపడింది నీకు? ప్రకాశం లలితమగడని యెన్నిసార్లో నీవే లలితను హాస్యంచేస్తూంటివే. నీ కీసంబంధం యిష్టము లేదని నేనెన్నడూ అనుకోలేదే!

కమలమ్మ:—లలితచిన్నప్పుడు ఏదోహాస్యంగా అనివుంటాను. ఐతే అదే నిజంకావాలెనేం? ధనమా, యింటితనమా, బలగమా యేమిచూచి యివ్వాలంటారండీ పిల్లను?

శ్రీపతి:—ఏమిచూచా? పిల్లవాని గుణాన్నీ, ఆరోగ్యాన్నీ, రూపాన్నీ, బుద్ధినీ, యింతేకాక లలితకూ వానికీ పరస్పరంవుండే ప్రేమనూచూచి. ఇంకేం కావాలె? ధనంప్రాధాన్యమైతే నా ఆస్తికి వేరేయెవరున్నారు? లలితకేకదూ చెందుతుంది?

కమలమ్మ:— మీరు సమాధానంచెప్పడానికేం లెండి? మీపిల్ల నెవరికిచ్చినారని అందరూ అడిగినప్పుడేమనిచెప్పుదును? మాయింట్లోవుండి దిక్కులేని పిల్లనానికని చెప్పొద్దూ! అది తలవంపుకదూ!

శ్రీపతి:—ఎవరికిచ్చినారని అడిగితే, మాప్రకాశానికని చెప్పు. ఎవరో పెద్దమ్మలెత్తిపాడుస్తారని లలిత మనస్సుకు విరుద్ధంగాజేసి దాని జీవితాన్ని నాశంజేయమంటావా? లలిత ప్రకాశా న్నెంతగా ప్రేమిస్తున్నదో గతీ గ్రహించినావా?

కమలమ్మ:—పెండ్లి కాకమునుపే యేమి ప్రేమండీ! మనం సంసారంచేయడంలేదా? మనం ముందు మాట్లాడివుంటిమా?

శ్రీపతి:—నేచెప్పేవిషయం శ్రద్ధగావిను. మనకు వివాహమైనప్పుడిద్దరికీ చిన్నవయస్సు. ఒకరికొకరికి క్రొత్త. వివాహమైన తర్వాత భర్తవద్ద కాపురమెట్లు చేయడం నీవు నేర్చుకున్నావు. భార్యగా నిన్ను చూడడం నేను నేర్చుకున్నాను. ఇప్పటి మనజీవితాని కిద్దరమూ అలవాటుపడినాము. అంతే. మనసంఘంలో నూటికి తొంభైతొమ్మిది సంసారాలట్టివే. కనుకనే ప్రేమతత్త్వం మనకు తెలీదు. లలితా ప్రకాశాల సంగతి వేరు. లలిత పుట్టిందిమొదలు ఒకచోట ఆడుకొని, ఒకకంచంలో తిని, అన్యోన్యంగా పెరిగినారు. ఒకరినివిడిచి వకరు భోజనం జేసిందికాని, కడకు కాఫీ తీసుకుందికాని ఒక్కనాడు చూచినావా? మొన్న లలితకు జ్వరంవచ్చినప్పుడు ప్రకాశ మెంత బెంగపెట్టుకున్నదీ, నిద్రాహారాలులేక ఎట్లు లలితను కనిపెట్టి వుండిందీ గమనించినావా? ప్రకాశం మద్రాసులో వుండేటప్పుడు ప్రతివారం జాబువ్రాయకపోతే లలిత యెంత భయపడేదీ, తానింత శ్రద్ధగా జాబులు వ్రాసేదీ చూస్తున్నావుకదూ? ఇంత ధృఢంగా వుండే వీరి ప్రేమబంధాలను తెంచివేయాలంటావుకదూ? నీ వింతవరకూ కండ్లుమూసుకొని వుండివుంటే వకసారి లలితనే అడిగి కనుక్కోరాదూ?

కమలమ్మ: — దాన్నేమండీ అడగడం? మనం మంచిసంబంధం కుదిర్చితే మనమాటకాదని యెదురు తిరుగుతుందా? నాతమ్ముడు వకీలుపరీక్ష కీయేడు పోయినాడుకదూ. వాడు ప్రకాశానికంటే యెందులో తక్కువ?

శ్రీపతి:—ఇంక చాలించు. నీకు హృదయముందని యింత చెప్పిచూచినాను. ఇక నీతో వాదించి ప్రయోజనంలేదు. ప్రకాశానికి నాయందు పితృగౌరవముంది.

నాకు కుమార్లులేరు. ఈవివాహంవల్ల నాలలిత నా జీవితపర్యంతం నావద్దనే వుంటుంది. ఈవివాహం నీ కిష్టమున్నా, లేకపోయినా జరిపితీరుతాను. ఉత్తరార్థంలో వుండే మనసంసారం యీకారణంవల్ల ఛిద్రమయినా, కండ్లుదెరవని లలితజీవితాన్నిమాత్రం నాశం చేయను.

ఇంతలో మోటారు యింటిముందర ఆగింది. కమలాప్రకాశాలు సంబరంతో కిలకిలనవ్వుకుంటూ వచ్చినారు. తండ్రి కుర్చీపట్టుకొని నిలబడి,

లలిత:—రమ్మంటే వచ్చినావుకావు నాన్నా, ఎంతబాగుందనుకున్నా వీరోజుఫిల్ము.

శ్రీపతి:—ఏమిటా ఫిల్ముపేరు?

లలిత:—'కిస్మత్ కా షికార్' అని హిందీ టాకీనాన్నా. ప్రకాశం కొన్నిపాటలుకూడా వ్రాసుకున్నాడు.

శ్రీపతి:—'కిస్మత్ కా షికార్' అంటే అర్థమేమోయి ప్రకాశం?

ప్రకాశం:—Prey of Destiny అని. మానవులు విధిచే వెంటాడబడుచున్నారని భావం. కర్మబద్ధులన్నమాట.

శ్రీపతి:—భావం మంచిదే. ఏమోరేపు విరామముంటే నేను వెళ్లివస్తా. భోజనానికి వేళయింది పదండి. తర్వాత కొంతసేపు పాడి వినిపింతురు.

3

సంధ్యాసమయం. ప్రకాశం మేడపై హాలులో కూర్చుని, తాను సినిమాలో విన్నపాటలను హార్మోనియంపై వాయిస్తున్నాడు. లలిత గబగబా పరుగెత్తుకొనివచ్చింది. ముఖ మెఱ్ఱబారింది. కండ్లలో నీళ్లు కదుల్తున్నాయి. ప్రకాశం లేచి తనప్రక్కన కూచోబెట్టుకొని,

"ఏమి లలితా సమాచారం? ఎందు కేడుస్తున్నావు?

లలిత:—మనిద్దరమూ యికమీదట మాట్లాడకూడదట. నేను నీవద్ద కూర్చోకూడదట. ఎక్కడికీ కలసిపోగూడదనీ.....

అంటూ యేడ్వడ మారంభించింది. ప్రకాశానికి గుండెనీరయింది. లలితను కొంత సమాధానంజేసి,

ప్రకాశం:—ఎవరన్నారు? నాన్నగారా?

లలిత:—కాదు. అమ్మ. నేను మా మామను పెండ్లిచేసుకుంటాననీ, నిన్నుచేసుకోవడం యిష్టంలేదనీ నాన్నగారితోనే చెప్పాలట. నేను నిన్నుదప్ప యెవ్వరినీ చేసుకోనని ఖండితంగా చెప్పినాను. అందుకు నాపైన కోపపడి, తిట్టి, యిప్పుడే పక్కింటికి వెళ్లింది.

ప్రకాశంమెడకి తనచేతులు రెండూ పెనవేసి అతని ముఖాన్నే చూస్తూంది లలిత. కళ్లనుండి నీళ్లొకటే ధారగా పోతున్నాయి. ప్రకాశంయెదుట వుండునది చిన్నప్పటినుంచీ తనతో ఆడుకున్న పెంకెలలితకాదు. ముఖంలో గాంభీర్యం, వయసుకుమించిన వుద్రేకం కనబడుతూంది. ఆమాపులు ప్రకాశంహృదయాన్ని కరకరకోసేస్తున్నాయి. ప్రకాశం యీప్రపంచాన్నే మరచినాడు. లలితను తనబాహువులలో బంధించినాడు. ఇరువురికీ దేహములపై ప్రజ్ఞలేదు. ఇంతలో కమలమ్మ ప్రవేశించింది. "లలితా" అని గట్టిగా పిలుస్తూ రెట్టబట్టి లాగింది. ప్రకాశం తలవంచుకొని నిశ్చేష్టుడై నిలబడినాడు. లలిత యేడుస్తూంది. కోపంతో రోజుతూ రెండవ శక్తిస్వరూపంలా గుంది కమలమ్మ.

కమలమ్మ:—లలితా, వెళ్లు క్రిందికి.

అని గర్జించగనే, లలిత తలవంచుకొని మెల్లగా వెళ్లిపోయింది. కమలమ్మ చురచుర ప్రకాశాన్ని చూస్తూ,

"ప్రకాశం, నిన్ను రెండేండ్ల పిల్లవాణప్పటినుంచీ నాకొడుకువలె సాకినాను. నీవు నాకింతద్రోహం జేస్తావనుకోలేదు. చెల్లెలిగా జూచుకోదగిన పిల్లజీవితాన్ని నాశంజేస్తున్నావు. నిన్నిన్నాళ్లూ పోషించి, చదువు చెప్పించినందుకిది ప్రత్యుపకారం. ఏమీ తెలియని పిల్లను మోసంజేసి పెళ్లాడదా మనుకున్నావుకదూ! ఇంత

"లలితను తనబాహువులతో బంధించినాడు"

స్వతంత్రమా! ఆయన నీకెక్కువ చనవిస్తున్నాడని గారి బంగళా. సాయంకాలం తోటలో భార్యతో పొగరు తలకెక్కింది నీకు. తిరిపెపుకూటికి యింటజేరిన నిన్ను తుమాత్రం దూరంలో వుంచవలసింది. పెండ్లీడు పిల్లతో సరసాలాడతావూ? ఇరవై యేళ్లొచ్చినాయే, సిగ్గులేదూ. ఇంకేం పరీక్షు పూర్తియేడ్చినాకే, యెక్కడైనా పోయి బతకూడదూ? సరే, ఆయనింటికి రానీ వుండు, నీవో, నేనో యెవరైనా వకరు యిల్లువిడువ వలసి వుంటుంది."

అని గుక్కతిప్పకుండా వాగి చరచర క్రిందికి దిగిపోయింది.

అట్లే నిలబడిపోయినాడు ప్రకాశం. సున్నితమైన అతని హృదయ మీవాక్శూలములధాటి కోర్వలేకపోయింది. తలవంచుకొనే తనగదిలోకి వెళ్లినాడు. పెట్టెతెరచి అందులో నుండి తనపర్సూ, ఫోటోలుంచిన ఆల్బం తీసినాడు. తానిదివరకూ స్వంతంగాదీసిన లలిత ఫోటోలన్నిటినీ యేరితీసుకున్నాడు.

క్రిందహాలులో యెవ్వరూ లేరు. లలిత తన రూములో యేడుస్తూహార్చుంది. నిశ్శబ్దంగా అట్లేచూస్తూ నిలబడినాడు ప్రకాశం. దృష్టిమరల్చుకోలేకపోయినాడు. కళ్లనీళ్లు క్రమ్మినాయి. ముందుకుపోవడానికి కాళ్లాడవు. ఇంతలో వంటింట కమలమ్మశబ్దం వినబడింది. నిద్రలో నడచువానివలె బైటికి నడచిపోయినాడు ప్రకాశం.

౪

కాశీవిశ్వవిద్యాలయంలో ఆంగ్లభాషాధ్యాపకుడు శేఖరం గారి బంగళా. సాయంకాలం తోటలో భార్యతో మాట్లాడుతూ కూర్చున్నారు.

లలిత కప్పుడిరువదియేండవయస్సు. ముఖంలో ముందున్నకాంతీ, వికాసం లేదు. దేహంపుచన్నె నీరసంగా అగపడుతూవుంది. దేహమనస్తత్వాలు రెండూ అసాధారణమైన మార్పుజెందినవి.

శేఖరం:—లలితా, పిల్లవాడేడీ? ఎట్లున్నాడీరోజు?

లలిత:—దాసీ దిప్పుడే పిలుచుకొనిపోయింది. అది 'లీవర్' బాధేనండీ. ఎవరో వైద్యుడొస్తాడన్నారే?

శేఖరం:— ఇంతట్లోరావచ్చు. ఆయనే నిన్న మాకాలేజీలో పాటపాడిందికూడా. రమ్మంటే వచ్చినావు కావు. చాలాఅద్భుతంగా పాడినాడు. ఇలాంటిసంగీతం సాధారణంగా వినం. ఎందుకురానన్నావు?

లలిత:— ఏమో, వూరికనే.

శేఖరం:— నీకు సంగీతంలో యెక్కువ అభిరుచిఅనీ, అందులో హిందుస్తానిపాటంటే ప్రాణమనీ మనపెండ్లికిముందు నీతలితండ్రు లన్నారు. కాని, కాపురానికిచ్చి యిప్పటికి మూడేళ్లయింది, ఒక్కనాడయినా పాడినావు గావు. సంగీతకచ్చేరీకి రమ్మంటేకూడా రావేం?

లలిత:— పెండ్లిఅయినాక యెక్కడిపాటండీ! అందులో పిల్లనాడొక్కనిమిషంకూడా వదలడు. ఎప్పుడు పాడుకుంటూకూర్చోడం?

శేఖరం:— ఈకారణం నాకంత నచ్చలేదు. ఇష్టమేవుంటే పాడుకోడానికి సమయం దొరకదూ? సాయంకాలం నేవున్నప్పుడు పాడకూడదూ! పిల్లవాడు నావద్దవుంటాడుకదూ?

లలిత:—ఏమో పోనివ్వండి. నాకు దాని పైన మనసుపోదు.

శేఖరం:— ఎంచేత? ఉన్నకళాభిరుచినీ చంపుకోవడమెందుకు? లలితా, నిన్నొకమాట అడగాలని వుంది. నాహృదయం నీకుదెలుసు. మనసిచ్చి జవాబుచెప్పుతావా?

లలిత తలయెత్తి శేఖరంముఖంలో చూచింది. అతడంతరంగంలో నొప్పిపడుతున్నాడని గ్రహించి,

లలిత:—మీరు నన్ను మనసారా ప్రేమిస్తున్నారని తెలుసు. మీయందు నాకేం దాపరికం?

శేఖరం:— ఈమూడేళ్లుగా మనం కాపురం జేస్తున్నాము. ఒక్కనాడు నీవు ఆనందంగా కాలం



"కమలమ్మ చురచురమని ప్రకాశాన్ని చూస్తూ....."

గడపింది నేను చూడలేదు. జీవితంమీద యింతటివిరక్తి కలగడాని కేం కారణం?

లలిత:— సంతోషంలేక నాకేం? ఎన్నడైనా యేడుస్తూకూర్చున్నానా?

శేఖరం:— లలితా, నాకు హృదయంలేదనుకున్నావు. తనుప్రేమించేవ్యక్తిమనస్థితి కనుక్కోలేని వాడు మానవుడెట్లవుతాడు! నాకుచెప్పకుండా లోననే కుళ్లుతూవున్నందువల్ల యేంప్రయోజనం? నాతో జెప్పితే నేదీర్చనూ నీదుఃఖాన్నీ?

లలిత.— మీకు సాధ్యమయ్యేదయితే చెప్పే దాన్నే.

శేఖరం:— తీర్చడానికి సాధ్యంకాకపోవచ్చు. కానిచెప్పినందువల్ల నీహృదయభారం కొంతతగ్గుతుంది. కాబట్టి చెప్పమంటున్నా. నామనసు తెలుసుకదూ. ఎందుకుజంకు?

లలిత:—ఇదివరలో మీకు నాతోకూడా పెరిగిన ప్రకాశంసంగతి చెప్పినాను జ్ఞాపకముందా?

శేఖరానికి కండ్లుదెరచినట్లయింది.

శేఖరం:—జ్ఞాపకముంది. మనపెండ్లికి రెండేండ్ల పూర్వం, యెవరికీ చెప్పకవెళ్లిపోయినాడన్నావు. లలితా, అతన్ని నీవుప్రేమించినావా?

లలిత జవాబుచెప్పలేకపోయింది. కళ్లనీళ్లు చెక్కులవెంబడి కారిపోతున్నాయి. తలవంచుకుంది. చివుక్కుమనింది. లలితమనోవేదన గ్రహించినాడు. శేఖరం మనస్సు. భార్యను కౌగిటిలోనికిదీసికొని వూరడిస్తున్నాడు.

లలిత:— మీరు కోపగించుకోకండి. మీహృదయాన్ని నాకర్పించినారుకాని, నేను మిమ్ములను సంతోషపెట్టలేకపోయినాను.

శేఖరం:— లలితా, నాకూ హృదయముంది. ప్రేమఅంటే యేమిటో నాకూతెలుసు. కాని, గతాన్ని గురించి విచారించితే యేంలాభం. మనం కర్మబద్ధులం. విధ్యన్విష్టులం. నీ యీ జీవితంలో ప్రేమఫలించుటకు మార్గంలేకపోయింది. అంతటిలో జీవితాన్ని నాశంజేసుకోవడంతో అర్థంలేదు. మ యిష్టప్రకారమే ప్రతిదీ జరిగితేయింకేం.

లలిత:— అతడీ ప్రపంచంలో వున్నదీ లేందీ కూడా తెలీదు. ప్రాణంతో వున్నాడనీ తెలిస్తే కొంత .....

ఇంతలో మోటారుడ్రైవరువచ్చి స్వామిజీగారు వచ్చినారన్నాడు.

శేఖరం:—లేలలితా. మాకాలేజీలో పాఠపాడిన సన్యాసి యీయనే. గొప్పవైద్యుడుకూడను. ఒకరోజు మనింటనే వుండి పిల్లవానికి చికిత్సచేయమని ప్రార్థించినాను. వారికి రొట్టెలూ, పాలూ సిద్ధంచేయించుపో.

ꕥ

మధ్యాహ్నం ఒంటిగంటయింది. శేఖరం కాలేజీకివెళ్లినాడు. పనిముగించుకొని దాసీదికూడా వెళ్లింది. లలిత పిల్లవాన్ని నిద్రబుచ్చి తానూ పక్కనేపరగి అప్పుడప్పుడే కండ్లుమూసింది. ఇంట నిశ్శబ్దంగావుంది. ఇంతలో మధురమైన రాగాలాపన లలితనిద్రకు భంగం గల్గించింది. లలిత కనులువిచ్చి ఆలకించి వినింది తమ మేడపైన యెవరో పాడుతున్నారు. ఆర్తాన్యమైన, గంభీరమైన కంఠధ్వని నిదివర కెచ్చటనో వినినట్టుంది. కాని, స్మరణకురాలేదు. చైతన్యరహితంగా వింటూ కూర్చుంది. ఆలాపన పాటలోకి మెల్లగా జారింది.

"రామకహానాడీ యేతన్
మర్తికామైనా జగజగ. రామ.
మర్తికో దకర్ మహల్ బనావే
మూర్ఖకహే ఘర్ మేరా
ఆయాబూరా లేజవె చోరా
ఘర్ నహి తేరా మేరా. రామ.
మర్తికావే మర్తిపేవే మర్తిమే శంకరజోవే
మర్తిమే ఓ మిలగయ మర్తి
వుప్పర్ చలే జనలోక్. జగజగ". రామ.

లలితకు ప్రాణాలు లేచివచ్చినాయి. గుండె దడదడ కొట్టుకొంటూంది. గబగబ మేడమీదికి వెళ్లింది. కళ్లుమూసుకొని తన్నుమరచి పాడుతున్నాడు సన్యాసి. లలితగుర్తుపట్టి 'ప్రకాశం' అని అరచి ముందుకు వ్రాలింది. కిందపడకుండా నిలిపి కుర్చీలో కూర్చోపెట్టినాడు ప్రకాశం. ఆనందమూ, దుఃఖమూ ఒక్కసారిగా లలితను పిచ్చిదానిగా జేసినవి. లలితముఖంచూస్తూ నిలబడిపోయినాడు ప్రకాశం. క్రింద పిల్లవాడేడుస్తూ మేడమెట్లెక్కబోతున్నాడు. ప్రకాశం క్రిందికిబోయి పిల్లవాన్నెత్తుకొని వచ్చినాడు. నిర్జీవప్రతిమవలె కూర్చుంది లలిత. కండ్లనీళ్లు కారుతున్నాయి.

ప్రకాశం:—లలితా, మనం మళ్లీ యీజన్మంలో చూచుకుంటామనుకోలేదు. నీవొకగృహిణివై యుండడం చూచే భాగ్యం నాకుగలిగింది. ఇక నాజీవితంలో కోరదగిం దేమీలేదు ప్రాతఃకాలం నీభర్త పిల్లవాణ్ణి నావద్దకు తెచ్చినపుడు పిల్లవానిముఖంలో నీపోలికజూచి మరియీజన్మంలో నా లలితను జూస్తావా అనుకున్నాను. నాలలితకుమారుణ్ణే ఎత్తుకు పోట్టు జేసినాడు ఈశ్వరుడు.



"సన్యాసి పిల్లవాణ్ణి ఎత్తుకొని వచ్చెను."

లలిత:—(దగ్గుతికతో) ప్రకాశం, ఆత్రపడి నీజీవితాన్ని పాడుజేసుకున్నావు. నాయీదేహాన్ని మరొకరి స్వాధీనంజేసినావు. నీవువెళ్లిపోయింతర్వాత రెండేండ్లు నా మనగారు నిన్ను వెదకుతూ వూరూరుతిరిగినారు. ప్రతివార్తాపత్రికలోనూ ప్రకటించినారు. కాని, నీజాడ తెలిసిందికాదు. మరి నీవు జీవంతో లేవనుకున్నారు. నాన్నగారీలోకానికి వెరచి నన్ను బ్రహ్మచారిణిగా వుండనిచ్చినారుకారు. నాకీవిధి తప్పిందికాదు.

ప్రకాశం:—లలితా, మనం కర్మబద్ధులం. విధిని తప్పించుకోలేం. నిన్ను భార్యగాజేసుకునేపుణ్యం నాకు లేకపోయింది. కాని నిన్ను ఆజన్మాంతం ప్రేమించే అదృష్టంమాత్రం గలిగింది.

లలిత:— నాకీజన్మంలో సౌఖ్యంలేదు ప్రకాశం. నిన్ను యీవిషయమైయే ఆయన నాతో మాట్లాడుతున్నారు. మనం ప్రేమించుకున్నసంగతిఆయనతో కూడా చెప్పినాను.

ప్రకాశం:—లలితా, పూర్వంవిషయాలిక మరచిపో. పురుషుల స్వభావం నీకుతెలీదు. పసేపదే నాప్రస్తావనదెచ్చి, నీభర్తను నొప్పించి, అతని జీవితంలో, నీజీవితంలోకూడా సౌఖ్యంలేకుండా జేయకు. మన ప్రేమ విషయరహితమయి నిర్మలమయింది. దాని కెప్పటికీ భంగంరాదు. నాకీప్రపంచంలో నీవుదప్ప మరెవ్వరూ లేరు. ఇద్దరం ఒకచోటపెరిగినాము. నీకంటే నాకు తోబుట్టువేదీ? నీవు సౌఖ్యంగావుంటే నాయీజీవితాని కెంతో వుత్సాహం. ఎప్పుడైనా యిద్దరం చూచుకోవచ్చు. మనస్సును శాంతింపజేసుకో. నేనిచ్చినమందు పిల్లవానికి మూడుపూటలువేయి. దాంతో పూర్తిగా గుణమవుతుంది. మరేమందూ వేయకు. నే నీరోజున కాలేజీలో వుపన్యాసంముగించుకొని రేపిచ్చటనుండీ వెళ్తా. ప్రతిసంవత్సరం నాసోదరిని చూచిపోతుంటాను. బెంగపెట్టుకోకు నాన్నగారెక్కడున్నారు? బాగున్నారా?

లలిత:—ప్రాక్టీసు చాలించినారు. బెంగుళూరులోనే వున్నారు. అప్పుడప్పుడు వచ్చిచూచిపోతుంటారు. కాని నేను అక్కడవెళ్ళడంలేదు. అమ్మకూడా యిచ్చటికి రాలేదు. నీవుపోయి నాన్నగారిని చూడు ప్రకాశం. నిన్నుతలచుకొని యెన్నిసార్లో పిల్లవానివలె యేడ్చినారాయన.

బంగాళాముందు కారుఆగింది. లలిత పిల్లవాణ్ణెత్తుకొని కిందికిదిగిపోయింది. శేఖరం సన్యాసిని కాలేజీకి పిలుచుకొనిపోవడానికై వచ్చినాడు. సన్యాసి మేడదిగివచ్చి శేఖరంతో కారులో కూర్చున్నాడు. లలితవచ్చి వాకిట నిలబడింది. కారు స్టార్టయింది. లలిత కండ్ల నీళ్లుక్రమ్మినాయి. నిమిషంలో కారు దృష్టిపథం దాటిపోయింది. కన్నీళ్లుకారుస్తూ అట్లే నిలబడిపోయింది లలిత.

జెనిత్ ద్రాక్షాసవ

ఆయుర్వేద శాస్త్రీయ పద్ధతులమీద తయారు కాబడినది

ఆరంభదశలో నున్న క్షయరోగము, ఉబ్బసము, శ్వాసనాళీద్రాహము, ఊపిరితిత్తులకు సంబంధించిన యితర వ్యాధులు, శీతలము, పడిసెము, మందాగ్ని, అజీర్తి, మలబద్ధకము, కడుపు పులియుట, వాంతులు వచ్చునట్లుండుట అన్నివిధములగు గొంతువ్యాధులు మున్నగు జాడ్యములను ఇది పూర్తిగా కుదుర్చును. పిల్లలదగ్గులను పోగొట్టుటలో అద్వితీయ మైనది. త్రాగుటకు మధురముగా నుండును. క్రమముగా సేవించినచో, ప్రేగులను శుభ్రముగా నుంచి, ఆకలిని వృద్ధిజేయును. జెనీత్ ద్రాక్షాసవమును రాత్రివేళ పరుండక మునుపు పుచ్చుకొనిన సుఖనిద్ర నిచ్చును. ఉదయమున మేల్కాంచినంతనే తమపనులయం దాసక్తులై చురుకుగా నుందురు.

"జెనిత్ ద్రాక్షాసవము" ఇప్పుడు ప్రతినగరములోను, పల్లెలందును గల దుకాణములలో దొరకును. తపాల ద్వారా సీసాల నంపుటచే మిగుల వ్యయ మగును గాన మా ఖాతాదార్లు వారిగ్రామములో గల దుకాణములందే "జెనిత్" ద్రాక్షాసవమును కొనినచో వీలుగా నుండుటేకాక లాభకరముగాగూడ నుండును.

వెల $1\frac{1}{2}$ పౌను రు. 1-12-0. 1 పౌను రు. 1-4-0. $\frac{1}{2}$ పౌను రు. 0-12-0. ప్యాకింగ్ వి. పి. ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రజిల్లాల యేజంట్లు:—
ఉపేంద్ర అండు కో., గుంటూరు.

Zenith Chemical Works,
Dekaran mansions, Princess St., Bombay No. 2.